ఊపందుకున్న వరినాట్లు


నాటేసేందుకు నారు తీస్తున్న మహిళా కూలీలు

జన్నారం/దండేపల్లి: ఇటీవల కురిసిన వానలకు తోడు, కడెం ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో జిల్లా వ్యాప్తంగా వానాకాలం సాగు పనులు ఊపందుకున్నాయి. ట్రాక్టర్లతో దమ్ముకొడుతూ కూలీలతో వరినాట్లు వేస్తున్నారు. వానాకాలం పంట సాగు పనుల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.


ట్రాక్టర్‌తో దమ్ముకొడుతున్న దృశ్యం


దండేపల్లి: వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు


పొలం గట్టున భోజనం చేస్తున్న మహిళా కూలీలు


జన్నారం: వరినాట్లు వేస్తున్న మహిళలు

క్లుప్తంగా

చిత్తడి రోడ్లకు మరమ్మతులు


మరమ్మతు చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు చినుకుపడితే చిత్తడిగా మారి నడక నరకప్రాయంగా మారింది. రోడ్ల దుస్థితిపై 'చిత్తడి రోడ్లతో అరిగోస' అనే శీర్షికన గత నెల 22న 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా మున్సిపల్ అధి కారులు స్పందించారు. పట్టణంలోని 9వ వార్డు పరిధిలోని కటికవాడ, మార్కెట్ రోడ్డు, నడిమిగూడెంలలో బుధవారం మరమ్మతు చేయించారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైన వెంటనే సీసీ రోడ్డు పనులు చేపడుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్ అనిల్, నసీమాబేగం పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జడ్జికి సన్మానం


శాలువాతో సన్మానిస్తున్న బార్ సభ్యులు

లక్సెట్టిపేట: మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి సల్లూరి సంపత్‌ను బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో ఘనంగా సన్మానించారు. స్థానిక జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ నాలుగు నెలల క్రితం ట్రైనింగ్‌కు వెళ్లగా మంచిర్యాలలో విధులు నిర్వర్తిస్తున్న సంపత్ ఇప్పటి వరకు ఇన్‌చార్జి జడ్జిగా విధులు నిర్వర్తించారు. రెగ్యులర్ జడ్జి రావడంతో మంచిర్యాలకు వెళ్లారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

చెన్నూర్: చెన్నూర్ జగన్నాథాలయంలో గోదా అమ్మవారి తిరు నక్షత్ర (జన్మదినోత్సవం) సందర్భంగా ఆలయంలో భక్తులు ఆలయ ప్రధానార్చకులు దామెర మోహనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అనిలాచార్యులు పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



పిల్లలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

భీమారం: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సమయపాలన పాటించాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఆదేశించారు. మండలంలోని బూర్గుపల్లి, కాజిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వపాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఎంపీవో సతీష్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఎం జీనత్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

బెల్లంపల్లి/చెన్నూర్‌రూరల్/వేమనపల్లి/లక్సెట్టిపేట/కోటపల్లి/తాండూర్/కాసిపేట/మందమర్రిరూరల్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. మూడో రోజు కార్యక్రమంలో భాగంగా మురికినీటి కాలువల్లో నిండి ఉన్న పూడికను తీయించి, నీటి పారుదల సౌకర్యాన్ని మెరుగుపర్చారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో మొరం పోయించి పూడ్చివేయించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని వక్తలు సూచించారు. పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



పాతమంచిర్యాల: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు స్పందన

జన్నారం: విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ ఫోరం నిజామాబాద్ సంస్థ ఆధ్వర్యంలో రైతువేదికలో ఏర్పాటు చేసిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాలకు చెందిన వివిధ గ్రామాల నుంచి వచ్చిన 30మంది విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వేదిక దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం చూపనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపం ఉన్నా ఫిర్యాదు చేయొచ్చని ఫోరం చైర్‌పర్సన్ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, ఫోరం సభ్యులు కిషన్, రాజగౌడ్, విద్యుత్ డీఈ కైసార్, ఏడీ ప్రభాకర్, ఏఏవో నరేందర్, జేఏవో హరికృష్ణ, జన్నారం మండల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యపై ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీపీ

నేడు వేమనపల్లిలో...

వేమనపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నీల్వాయి సబ్‌స్టేషన్ వద్ద గురువారం 10.30గంటల నుంచి 1గంట వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఉంటుందని బెల్లంపల్లిరూరల్ ఏడీఈ రాంచందర్ తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

• జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్

జైపూర్: గ్రామాల్లో ప్రతి రోజు డ్రై డే జరపాలని, ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ తెలిపారు. మండలంలోని కుందారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశకార్యకర్తల సమావేశంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయనతో జిల్లా ప్రోగ్రాం అధికారులు అనిల్‌కుమార్, ఫయాజ్‌ఖాన్, స్థానిక వైద్యాధికారి శ్రావ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.


ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రాజ్

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

జన్నారం: చదువుతున్న వయస్సులోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ అన్నారు. మండల కేంద్రంలోని స్లేట్ సీబీఎస్‌ఈ పాఠశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల ప్రమాణ స్వీకార వేడుకలకు సీఐ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుకునే వయస్సు నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు, బాధ్యతలు నేర్చుకోవాలన్నారు. చదువుకునే స్థాయి నుంచి ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు విలువ, మంచి లక్షణాలు నేర్పిస్తూ సమాజంలో మంచి నడవడికను కొనసాగిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. సమావేశంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎస్సై రాజవర్ధన్, స్లేట్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు సుభాష్‌రెడ్డి, చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ నరేందర్

పోలీసుల ఆకస్మిక తనిఖీ

చెన్నూర్: పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వంద మీటర్ల సమీపంలోగల పాన్‌షాపులపై పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఐదు పాన్‌షాపులలో ప్రభుత్వ నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఆ పాన్‌షాపుల యజమానులను తహసీల్దార్ ఎదుట రూ.2లక్షల పూచికత్తుపై బైండోవర్ చేశారు. పోలీసుస్టేషన్‌లో పాన్‌షాపు యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

హక్కుల కోసం పోరాడుదాం

లక్సెట్టిపేట: ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుదామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి అన్నారు. కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ పోరాటం చేస్తుందన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో నోబెల్ గ్రహీత, జాతీయ గీతం రచయిత రవీంద్రనాథ్‌ఠాగూర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పాఠశాల హెచ్‌ఎం బుచ్చన్న, ఉపాధ్యాయురాలు కల్పన, అంగన్‌వాడీ టీచరు లక్ష్మి, విద్యార్థులు నివాళులర్పించారు.

జీపీ స్పెషల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి స్పెషల్ ఆఫీసర్ విధుల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమెపై వెంటనే చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని సారంగపల్లి గ్రామస్తుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ బుధవారం కలెక్టర్ ఆఫీస్‌లో ఏఈ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. జీపీకి సంబంధించిన నిధుల్లో కూడా అవినీతికి పాల్పడిందని, చర్యలు తీసుకుని సస్పెండ్ చేసి సారంగపల్లి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 10న నిర్వహించే సీపీఐ పార్టీ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

బాధ్యతలు స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ అంజయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. విశ్వనాథస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఠాకూర్ ప్రతాప్‌సింగ్ గూడెంకు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అంజయ్య మంచిర్యాలకు బదిలీ అయ్యారు.

పాత కార్మికులనే కొనసాగించాలి

మందమర్రిరూరల్: ఏరియాలో కొత్తగా పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లు మారినప్పుడల్లా ఆ విభాగంలో విధులు నిర్వర్తించే కార్మికులను తొలగిస్తూ, పనులు కల్పించకుండా రోడ్డున పడేస్తున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. ఏరియా స్టోర్‌ను బుధవారం సందర్శించిన సందర్భంగా కాంట్రాక్ట్ మహిళా కార్మికులు వారి గోడు వినిపించారు. కాంట్రాక్టర్ కొత్తగా వచ్చినప్పటికీ, పాత కార్మికులతోనే విధులు నిర్వహించే విధంగా యాజమాన్యం చొరువ చూపాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి కూచిపూడి పోటీల్లో ప్రతిభ

చెన్నూర్: గోదావరిఖనిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సంస్కృతి శాఖ సహకారంతో గీతారాజ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కూచిపూడి పోటీల్లో చెన్నూర్ అభ్యాస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ధరణి కిరాణ్మయి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫస్ట్ నిలిచిన కిరాణ్మయికి మెమోంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని నిర్వాహకులు అందజేశారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం

మంచిర్యాలఅర్బన్: ఏబీవీపీ నగర నూతన కమిటీని బుధవారం విభాగ్ కన్వీనర్ అజయ్ ప్రకటించారు. మంచిర్యాల నగర కార్యదర్శిగా లావుడ్యా అనిల్, ఉపాధ్యక్షులుగా సిద్ధు, అరవింద్, శ్రీరామ్, నగర సంయుక్త కార్యదర్శులుగా సాయి, చరణ్, కృష్ణ, మనోహర్, జీవన్, నగర హాస్టల్ ఇన్‌చార్జీగా వంశీ నాయక్, కార్యవర్గ సభ్యులుగా అభి, నక్క కార్తిక్, సాయి చరణ్, అంజన్నను నియమించారు.

గర్భిణులకు సీమంతం


గర్భిణులతో మమత, మహిళా తరంగిణి సభ్యులు

మంచిర్యాలక్రైం/దండేపల్లి/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీ, సంజీవయ్య కాలనీల్లో మమత, మహిళా తరంగిణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని బుధవారం 20మంది గర్భిణులకు సీమంతం చేశారు. 10మంది చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గూడెం అంగన్‌వాడీకేంద్రంలో, హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో, వేంపల్లిలోని ఎస్‌ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ఘనంగా చేనేత దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలీలు

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్/పాతమంచిర్యాల/దండేపల్లి: జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరించిన లోగోకు పూలమాల వేసి వందనం సమర్పించారు. రామకృష్ణాపూర్ పట్టణంలో మోటార్‌బైక్ ర్యాలీ చేపట్టారు. జిల్లా కేంద్రంలో చేనేత రంగంలో నైపుణ్యం పొందిన చేనేత కార్మికుడు అనుమాండ్ల సుదర్శన్‌ను సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సన్మానించారు. దండేపల్లిలో మార్కండేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

భీమారం: నవంబర్‌లో జరిగే జాతీయ సాధన సర్వే (ఎన్‌ఏఎస్)పై ఐదు మండలాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాల లోస్కూల్ కాంప్లెక్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చెప్పాల్సిన మెలుకువలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ విక్రమ్, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, భీమారం మండలాలకు చెందిన సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులతో పాటు రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలి

దండేపల్లి: విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాల్లో నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. మండలంలోని గూడెం, వెల్గనూర్, ద్వారక, గుడిరేవు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు రఘునాథ్ వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్స్‌లను బుధవారం అందించారు.

9న ఆదివాసీ దినోత్సవం

కాసిపేట: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. కొండపూర్‌యాపలో బుధవారం ఆదివాసి దినోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు.

బీపీ మండల్‌కు నివాళులు

పాతమంచిర్యాల: మండల్ కమిషన్ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేసి బీసీల జనాభా లెక్కలు సేకరించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం మండల్ దివస్‌ను జరుపుకున్నారు. బీపీ మండల్ చిత్రపటానికి పూలలు వేసి నివాళులర్పించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాండూర్/కాసిపేట: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ చదువుకు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని తాండూర్ సీఐ కుమారస్వామి కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సోమగూడెం మైదానంలో క్రీడాకారులకు, యువకులకు, విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలు, సైబర్ క్రైం మోసాలపై అవగాహన కల్పించారు.

బురద రోడ్డుతో ఇబ్బందులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి లింగన్నపేట గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.2.25కోట్లతో వంతెన నిర్మాణ పనులను అధికారులు హడావుడిగా పూర్తి చేసి అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యంతో 12గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా అప్రోచ్ రోడ్డు లేక ప్రమాదాలు జరుగుతున్నా అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణకష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



'ఎస్సీ డిక్లరేషన్‌ను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం'

బెల్లంపల్లి/కాసిపేట/జన్నారం/తాండూర్: ఎస్సీ డిక్లరేషన్ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని బీజేపీ, ఎస్సీ మోర్చా నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, చేవెళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. అంబేద్కర్ అభయ హస్తం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షలు, పక్కా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని నమ్మించి ఆచరణలో అమలు చేయడం లేదని ఆరోపించారు. హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రోడ్లపై నాటేసి నిరసన



వేమనపల్లి: మండలంలోని నీల్వాయి కొత్తగూడం కాలనీ రోడ్డు గుంతలమయంగా ఉండి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో రోడ్లపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు.

పొలం గట్ల కత్తిరింపు.. పంటకు మేలు



మందమర్రిరూరల్: పొలం గట్ల కత్తిరింపుతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్‌లో బుధవారం పంట పొలాలను సందర్శించి గట్ల కత్తిరింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

స్తంభాలు సరిచేశారు



సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని తానిమడుగు రోడ్డు సమీపంలో పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభం, దండేపల్లి ఫారెస్టు ఎంట్రెన్స్ సమీపంలో ఓ పొలంలో రెండేళ్ల క్రితం విద్యుత్ స్తంభం పడిపోయినా పట్టించుకోకపోవడంతో 'పడిపోయినా పట్టించుకోరా' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం అయింది. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించారు. తానిమడుగు సమీపంలో వంగిన స్తంభాన్ని సరిచేశారు. దండేపల్లి సమీపంలో పొలంలో పడిపోయిన స్తంభాన్ని లేపి, లూజ్ వైర్లను సరిచేశారు.

ఇంటినంబర్ జారీ చేయాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో జీవో నంబర్ 76కింద ఇళ్ల పట్టాలు పొందిన ప్రతి వ్యక్తి ఇంటికీ మున్సిపాలిటీ నుంచి వెంటనే ఇంటి నంబర్లు జారీ చేయించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, పలువురు కౌన్సిలర్లు కోరారు. కలెక్టర్ కుమార్‌దీపక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

భీమిని: తపాలా శాఖ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యవేక్షకుడు సిద్ధార్థ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం డక్ చౌపాల్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పీహెచ్‌సీ సందర్శన

దండేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ ప్రసాద్, సీతారామరాజు బుధవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపీ రిజిస్టర్లు తనిఖీ చేశారు. మందుల నిల్వలు పరిశీలించారు. లేని మందులు తెప్పించుకోవాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా హెల్త్ క్యాంపులు పెట్టాలని వైద్యాధికారి సతీష్‌కు సూచించారు.

ఆవుడంలో వైద్య శిబిరం

నెన్నెల: మండలంలోని ఆవుడం సబ్‌సెంటర్‌లో బుధవారం మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఒకరికి డెంగీ పాజిటీవ్ రావడంతో ముందు జాగ్రత్తగా పరీక్షలు నిర్వహించి జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించారు.

బీజేపీలో చేరిక



చెన్నూర్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మద్ద మధూకర్ బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ చేరికల కమిటీ సభ్యులు బత్తుల సమ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెర్రబెల్లి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో చెన్నూర్ బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, బీజేపీ నాయకులు కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.